# శకుంతల

చంద్రుడు మనస్సుకు కారకుడు. ఓషధీశ్వరుడు, వెలాతెలా పోయి-జారుకున్నాడు. ఇటు సూర్యుడు. బాలసూర్యుడు, నీలిపల్లవంలాగా, మందార పుష్పంలాగా పైపైకి వస్తున్నాడు. ఇద్దరూ మహానుభావులే. వారు జారు కున్నారు. వీరు విజృంభిస్తున్నారు. యివి రెండు దశలు. ఈ ప్రపంచంలో ప్రతివారికీ యీ రెండు దశలమధ్యా వారి వారి దశలనుబట్టి నియామకం జరుగుతోంది.

ఇవాళ నేను అత్తవారింటికి పోతున్నాను. శకుంతల అత్తవారింటి కివాళ వెళతోందని కణ్వాశ్రమం అంతా అదోవిధంగా వుంది. పసితనం నుంచీ యిక్కడే వుండి పెరిగిన పిల్ల. తమలో ఒకత్తుక, యిల్లాలై, తల్లి కాబోతూ అత్తవారింటికి వెళతోంది. చెట్లు చేమలు ముఖాలు వేలాడ వేశాయి. ఆశ్రమ మృగాలు పిచ్చివాలకం పడి, నా చుట్టూరా తిరుగు తున్నాయి. మునులు,రుషులు, ఎంత నిస్సంగులైనా అదోవిధంగా వున్నారు. ఆశ్రమాగ్నులకు ప్రదక్షిణం చేసి, సెలవు తీసుకున్నాను. కణ్వమహర్షి, పెంచిన మమకారాన, అప్పగింతలు చెపుతున్నారు. కోకిల అనుమతి సూచ కంగా మధురంగా కూసింది. నన్ను రాజధానికి తీసుకుని వెళ్ళేందుకు తోడుగా వస్తూన్న వటువులు శార్ఙ్గరవుడు, శారద్వతుడూ, గురువుగారి ఆజ్ఞకు ఎదురు చూస్తున్నారు.

తండ్రిగారు, మహానుభావులు - "అమ్మా, వెళుతున్నావా నీ యింటికి...."అంటూ కన్నీరు తుడుచుకున్నారు. ఆడ తోడుగూడా వుండడం మంచిది అని వృద్ధగౌతమిని నా వెంట పంపుతున్నారు. ఆశ్రమాన్ని - సెలవు యివ్వు తల్లీ — అనుకున్నాను, మనస్సులో — ఇంతకాలం అనుభవంలో ఉన్న ఆశ్రమం, ఆదరించిన ఆశ్రమం, సంరక్షించిన ఆశ్రమం, పెంచి పెద్దచేసిన ఆశ్రమాన్ని వొదిలి వెళుతున్నానే అనేసరికి - మనస్సు మరోలాగయింది.

ఈ దేశంనుంచి ఆ దేశానికి పోతున్నాను. కొత్త దేశంలో, కొత్త పరిస్థితులలో జీవయాత్ర చేయాలి మరి. మళ్ళీ యీ ఆశ్రమాన్ని ఎప్పుడు చూస్తానో ఏమో. మహర్షి కణ్వులవారు అన్నారుగదా-"అమ్మా, నీ యింటికి వెళ్ళి దుష్యంతపత్నివి మహారాణివై బహుకాలం రాజ్యం ఏలి, బిడ్డడికి రాజ్యాభిషేకంచేసి పెద్దరికంలో అలాగే ఇక్కడకు వద్దురుగానిలే"-అన్నారు. ఎంతమాట. వృద్ధాప్యంలో వానప్రస్థం వెళ్ళడం వుంటుంది గదా, అప్పుడు, ఏదో ఆశ్రమానికి వెళ్ళేబదులు యిక్కడికే రండి, నీవూ నీ భర్తా ఇక్కడికే రండి-అన్నారన్నమాట.

సూర్యుడు చరచరలాడి కరకరలాడాడు. చెప్పవలసిన మాటలు చెప్పి మహర్షి మమ్మల్ని పంపారు. బరువుగా కదిలాం. రాజధాని నగరం చేరుకున్నాం.

నిర్మలమూ, నిస్తులమూ అయిన ఆశ్రమాన్ని వొదిలి, ఆ బాల్యస్నేహితులయిన అనసూయా ప్రియంవదలను వొదిలి, మనోహరమయిన మాలినీ నదిని వొదిలి, ఆజన్మ సహచరులయిన తరువులను, చెరువులను వొదిలి, అలవాటు అయిన ఆమోదప్రమోదాలతోపాటు ఆత్మజ్ఞానాన్ని కలిగించే ఆశ్రమారణ్యాలను వొదిలి, ఆత్మీయమైన అన్నింటినీ వదిలి — జీవయాత్ర చేస్తున్నాను. మాయ మర్మాలు లేని ఆశ్రమంనుంచి కల్లాకపటాలు,

కార్పణ్యాలు, ఎత్తులూ జిత్తులూ వీర విహారంచేసే పట్టణానికి చేరుకున్నాము. స్వార్థం అంటూ ఎరగని మునివాటికనుంచి స్వార్థమే సామ్రాజ్యం ఏలే రాజధానికి చేరుకున్నాము. మహారాజసభకు చేరుకున్నాము. మహారాజ సన్నిధికి చేరుకున్నాము. శార్ఙ్గరవుడు, శారద్వతుడూ, గౌతమీ నేనూ మహారాజ సభకు చేరాము. మహారాజు నన్ను చూడగానే, పరకళత్రంగా భావించారు. ఆ మాట ఆయన నోట వినగానే, నా గుండెలు కొట్టుకున్నయ్. మహర్షి కణ్వులవారి సందేశాన్ని శార్ఙ్గరవుడు చెప్పాడు. మహారాజుకు, నన్ను పెళ్ళాడిన సంగతే గుర్తులేదుట. అబ్బ, ఏమిటీ మోసం?

తాము ఆశ్రమానికి రావడం, నేను అతిథి సత్కారం జరపడం, వారు నన్ను చూడడం, మా చూపులు, మాటలు, హృదయాలు కలవడం, మనువులు, తనువులు ఒకటి కావడం, నేను యిదుగో వెళుతున్నాను. ఇది నా ఉంగరం. నా నామాక్షరాలు వున్నయ్ చూడు, మూడు అక్షరాలు. మూడు రోజులలో నా పరివారం వస్తుంది; నిన్ను నా దగ్గిరకే రప్పించుకుంటాను.... అన్నమాటలు-ఎలా మరవగలిగారు? రాజసభలో నా గోడు ఎవరికి పడుతుంది? అందులో, ఐశ్వర్యమత్తం అయిన ప్రదేశంలో! ఆనాడు, ముద్దుగా మురిపెంగా నా వ్రేల ఉంచిన ఉంగరాన్ని చూపించబోయాను. ఉంగరం ఎక్కడో జారిపోయింది. కాలం కర్మం ఎదురు తిరిగితే, మనమాట మనకు విరోధి, మన నీడ మనకు ప్రతికూలం. మనమే మనకు శత్రువులం కాబోలు. మహారాజు దుష్యంతులు నన్ను, నా మాటలను నమ్మలేదు. పరిత్యజించారు.

నా జీవితయాత్ర యిలా సాగుతుంది కాబోలు. పుట్టిననాడే తల్లీ తండ్రీ నిర్దయగా నన్ను వొదిలేశారు. యిప్పుడు భర్త పరిత్యజించారు. ఇన్ని మాటలెందుకు? తక్కువ నోములు నోచినాను నేను. యిప్పుడు ఏం అనుకుని ఏం లాభం? ఇంతకూ నా జీవితయాత్ర యిలా సాగుతుంది కాబోలు.

స్వతంత్రించి మహారాజు దుష్యంతులకు ఆనాడు నన్ను నేను సమర్పించుకున్నాను. ఇప్పుడు ఎవర్నని ఏంలాభం? నన్ను నేను అనుకోవాలి. హృదయం తెలియనిచోట స్నేహం చేస్తే, ఆ స్నేహం వైరంగా పరిణమిస్తుంది అన్నమాట. నా గతికి నన్ను వొదిలి, శార్ఙ్గరవుడు, శారద్వతుడూ కదిలారు. రాజపురోహితుడు పాపం, జాలిగుండెలవాడు అడ్డం వచ్చాడు.

“రాజా, యీమెను మాయింట వుంచుతాను, ప్రసవించేదాకా. నీకు చక్రవర్తి ఐన పుత్రుడు కలుగుతాడు అని పెద్దలు చెప్పారుగదా. ఆ పుట్టే బిడ్డకు చక్రవర్తి లక్షణాలుంటే సరేసరి– లేదూ, అప్పుడే కణ్వాశ్రమానికి ఆమెను పంపవచ్చు” అన్నాడాయన.

మహారాజు అంగీకరించారు. ఏడుపును మింగుకోలేకపోయాను. యివతలికి వచ్చానో లేదో తేజోమేఘం ఆవరించింది. నన్ను ఆకర్షించి పట్టుకుంది. మబ్బుల్లో తేలిపోతున్నాను. స్పృహలేదు. ఏమైందో తెలియదు.

బిడ్డ కాదన వచ్చుగాని, కన్నతల్లి ప్రేమకు అవధిలేదు. మా అమ్మ మేనక నన్ను కాపాడుతూనే వుంది. మహారాజసభలో నవ్వులపాలై, వంచనపరురాలనుగానై, అక్కడే ఓ అయ్య ఇంట్లో తలదాచుకుని యీడవడం– మా తల్లికి- ఎట్లా రుచిస్తుంది? పాపం, ఆమె, తన ప్రాణసఖిని సానుమతిని పంపిందిట.

కింపురుషుల పర్వతం, హేమకూటం, హేమకూటంమీద మారీచాశ్రమం. అక్కడ కన్నులు తెరిచాను. ఆశ్రమప్రదేశం అంటేనే చాలు, ప్రాణం లేచి వస్తుంది. మనస్సుకు మార్దవం, వచస్సుకు సంయమం, ఆత్మకు ఆమోదప్రమోదాలు వస్తయ్ అక్కడ. దుఃఖం అనేది వున్నా, పెద్దబావిలో

అడుగునపడివున్న చిన్న ముంతలాగా వుంటుంది. నా మనస్సుకు ముని పల్లెలకు మించిన స్వర్గం అంటూ తోచదు. అందుకే యిక్కడకు చేరి వుంటాను. మారీచాశ్రమం ఎంత గొప్పది!

ప్రాణవాయువు ఆడుతూండడంవల్ల, బ్రతికి వున్నట్లుగా, కల్పవృక్షాల మనమంటి చోట నివాసం, పైడి పద్మాలపరాగం పట్టిన నీట- ధర్మాభి షేకాలు, రత్నశిలాతలాలలో, అప్సరసలను తలదన్నే అంగనామణుల సన్నిధిలో ధ్యానం, మిగిలిన మునులు కోరుకునేవాటిమధ్య- యిక్కడ తపస్సు చేస్తారు. మరీ ఒకరు- ఏనాడు తపస్సుకోసం కూర్చున్నారో ఏమో- వారి చుట్టూ పుట్టలు పెరిగి, వారి కంఠందాకా పెరిగినయ్. పాముల కుబు సాలు, చెట్లతీగలు వారి కంఠాన్ని పెనవేసుకున్నాయి. వారి జడలలో పిట్టలు చిన్న చిన్న గూళ్ళు కట్టుకున్నయ్. సూర్యబింబాన్నే చూస్తూ ఆ తపస్వి స్థాణువులాగా ఉండిపోయారు.

తల్లినైనాను. కన్న తండ్రికి నా పోలిక అన్నారు. నాకేమో మహా రాజ దుష్యంతుల పోలికలు కనిపిస్తాయి. అయితే వీడికి, స్త్రీ కుసుమ సౌకు మార్యమూ, తండ్రి వజ్రకాఠిన్యం కూడా కాబోలు!

పిల్లడు అల్లరివాడైనాడు. భరతుడు నా బంగారు బాబు, పెరిగి పెద్ద వాడౌతున్నాడు! పిల్లవాడు దుడుకు అయ్యాడు. పిల్లవాడు సమగ్రంగానూ వుంటాడు. పిల్లవాడు విని గ్రహిస్తాడు, చూచి గ్రహిస్తాడు. వాడికే తోస్తూ వుంటాయి. నిజమే. మునులు వాణ్ణి సర్వదమనుడు అంటారు. నాకేమో భరతా అంటేనే ముద్దు. కన్నతల్లి సంతోషించవలసినదే. కాని, భయం అంటే ఎరగడు. మనం కాని కాలం వెళ్ళదీస్తున్నాం నాయనా, దుడుకు పను లకు పోకు అని నెత్తిన నోరు పెట్టుకుని చెప్పినా వినడు. సింహం పిల్లలు పాలు తాగుతూంటే, వాటిని లాక్కొస్తాడు. ఆ తల్లి గాండ్రిస్తుంది. ప్రమాదం అంటే ఏమిటనే వాడితో ఎలాగ వేగడం?

సూర్యుడు రమ్యంగా ఉదయించాడు. చిత్రంగా పద్మాలు వికసిం చాయి. ఆశ్రమాంగనలు మధురంగా సౌమ్యంగా వారి వారి పనులు నిర్వ ర్తిస్తున్నారు. భరతుడు ఎక్కడికో వెళ్ళాడు. గౌరీ శంకరులకు మొక్కు కుని వస్తున్నాను. భరతుడు ఎవరితోటో తర్కిస్తున్నాడు. ఆహా వాడి కంఠమే. తాపసిగూడా వుంది. ఆమె మావాణ్ణి గురించి చెబుతోంది. ఎవరిదో మూడో కంఠం. మరి యితను మునికుమారుడు కాకపోతే ఎవరి బిడ్డడు ? బాగా ఎరిగున్న కంఠం. తాపసి పూరువంశజుడు, అంది. రక్షాబంధనం భరతుడి దగ్గిర్నుంచి జారిపడింది. దాన్ని ఆయన తీసి యిచ్చాడుట. ఆ రక్షా బంధనాన్ని భరతుడూ వాడి తలిదండ్రులూ తప్ప మరొకరు భూమ్మీదనుంచి తీసి యివ్వలేరు. మరొకరయితే అది పామై కరుస్తుంది. ఆహా, పౌరవ రాజర్షే.

ఇక్కడా వారి దర్శనం! ఈ స్థితిలోనా.... భరతుణ్ణి లాలిస్తున్నారు. మాసిన వలువలు, ఎండి, పాలిపోయిన ముఖం, అట్టకట్టిన జడలు నన్ను చూచి గుర్తుపట్టారు. వారే ముందు పలకరించారు. కన్నీళ్ళతో కంఠం పలకలేదు. వారు రాజర్షి. పౌరవ వంశరత్నం. నా హృదయసర్వస్వం. తమ తప్పు తెలుసుకుని, ఎంతగా కుమిలిపోయారో, సానుమతి చెప్పింది గదా! వారు, ఆనాటి ప్రేమతో నా పాదాలమీద వ్రాలారు.

నేను.... పరిత్యక్తను. నేను, వారిని ఓదార్చవలసి వచ్చింది; ఓదార్చాను.

మారీచులవారి సన్నిధికి వెళ్ళాము. నమస్కరించాము. సకుటుంబంగా నమస్కరించాను.

వారు దీవించారు. మారీచులవారు తెలిపారు, యిది దుర్వాసుల శాపం అని. అ-బ్బ. శాపం అనుభవించాము. జీవయాత్ర అంటే మాటలా? అనుభవించితీరాలి అంతే.